International Journal of Multidisciplinary Trends

**E-ISSN:** 2709-9369
**P-ISSN:** 2709-9350
www.multisubjectjournal.com
IJMT 2023; 5(1): 41-48
Received: 19-10-2022
Accepted: 21-12-2022

**డా॥ వి.నారాయణప్ప**
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆధునిక భారతీయ భాషలు
మరియు సాహిత్య అధ్యయన
శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం,
ఢిల్లీ, ఇండియా

**Corresponding Author:**
**డా॥ వి.నారాయణప్ప**
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆధునిక భారతీయ భాషలు
మరియు సాహిత్య అధ్యయన
శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం,
ఢిల్లీ, ఇండియా

# విశ్వనాథశ్రీమద్రామాయణకల్పవృక్షం కువెంపుశ్రీరామాయణదర్శనం: ఒకతులనాత్మకపరిచయం

డా.వి.నారాయణప్ప

**అమూర్త**

రామాయణం మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం. రామాయణం ప్రపంచ సాహిత్యంలోనే 'ఆదికావ్యం'. వాల్మీకి మహర్షి సంస్కృతంలో దీనిని 24 వేల శ్లోకాల్లో రాశాడు. ఇది ముందు తరాల వారికి స్ఫూర్తినిస్తుంది. అందువల్లనే ఇలాంటి పవిత్ర వాల్మీకి రామాయణం ఈనాడు భారతీయ భాషల్లోనే కాక ప్రపంచ దేశాల భాషల్లోకి కూడా అనువాదమై వ్యాప్తి చెంది సాహిత్య సౌరభాలను వెదజల్లుతోంది. తెలుగు, కన్నడ భాషల్లో కూడా వాల్మీకి రామాయణాన్ని అనుసరించి ప్రాచీన కాలం నుంచీ నేటి వరకు అనేక రామాయణాలు వచ్చాయి. అయితే ఆధునిక కాలంలో తెలుగు, కన్నడ భాషల్లో ప్రసిద్ధి చెందిన రెండు రామాయణాలు కనబడుతున్నాయి. తెలుగులో ఆధునిక ప్రసిద్ధ కవి విశ్వనాథ సత్యనారాయణగారు "శ్రీమద్రామాయణ కల్పవృక్షం" అనే లోకోత్తర కావ్యాన్ని రచించారు. దీనికి 1971లో భారతీయ జ్ఞానపీఠ పురస్కారం లభించింది. అలాగే కన్నడంలో సుప్రసిద్ధ ఆధునిక మహాకవి కుప్పళ్ళి వెంకట పుట్టప్పగారు "శ్రీరామాయణ దర్శనం" అనే మహాకావ్యాన్ని రచించారు. దీనికి కూడా 1968లో భారతీయ జ్ఞానపీఠ పురస్కారం లభించింది. వీరి రామాయణాలు మహోన్నత ఆధునిక భావాలు కలిగిన ఉత్తమ కావ్యాలు. ఈ మహాకావ్యాలను గురించి పాఠకులకు తులనాత్మకంగా పరిచయం చేయడం జరిగింది. ముందుగా తెలుగు, కన్నడ భాషా సాహిత్యాల సంబంధాలను గురించి కొన్ని అంశాలు; తర్వాత రెండు భాషల్లో వచ్చిన ప్రాచీన రామాయణాలను స్థూలంగా పరిచయం చేయడం జరిగింది.

**కీలక పదాలు:** కాకతాళీయం, పురస్కారం, అద్వైతి, శిరోమణి, రగడ, పాషాణం, కల్పవృక్షం, దర్శనం, స్రోతస్సు, మహోపమ, శిలాతపస్విని, తర్కసింహిణి, కృపాశూలి, ముక్తిరాహు, రేచక, పూరక, కుంభకాలు, అన్నమయ.

**తెలుగు, కన్నడ భాషా సాహిత్యాల సంబంధాలు**

క్రీ.శ.10వ శతాబ్దం నుంచీ తెలుగు - కన్నడ సాహిత్య సంబంధాలు చాలా దగ్గరగా కనిపిస్తాయి. వాటికి అనేక కారణాలున్నాయి.

1. ఆంధ్ర - కర్నాటక రాష్ట్రాలు భౌగోళికంగా పరస్పరం పక్కపక్కనే సహజంగా ఉండటం.
2. తెలుగు - కన్నడ భాషలు ద్రావిడ భాషాకుటుంబానికి చెందటం.
3. క్రీ.శ.16వ శతాబ్దం వరకు రెండు భాషలకూ 'వేంగీ చాళుక్యలిపి' కలిగి ఉండటం. ఆధునిక లిపిలో కూడా తెలుగు - కన్నడ భాషలలో పెద్ద భేదాలు కనిపించవు. కేవలం 'ఉ - ఋ - క - చ - హ' అక్షరాలు తప్ప.
4. వ్యాకరణం, ఛందస్సులు కూడా రెండు భాషలలోనూ ఒకే విధంగా ఉండటం.
5. ఆంధ్ర - కర్నాటక ప్రాంతాలను ఒకప్పుడు ఒకే వంశానికి చెందిన శాతవాహనులు, చాళుక్యలు, విజయనగర రాజులు ఏలడం.
6. బసవేశ్వరుని వీరశైవం తెలుగు - కన్నడ ప్రజలను, వారి సాహిత్యాన్ని చాలా ప్రభావితం చేసింది. ఈ బసవేశ్వరుని వీరశైవ ప్రభావం కన్నడ సాహిత్యంపై ఆధునిక కాలం వరకూ చెరగని ముద్రవేసికొని కొనసాగింది. ఇది తెలుగు సాహిత్యంపై క్రీ.శ.12వ శతాబ్దంలో ఎక్కువ ప్రభావం చూపింది. అయితే, తెలుగు సాహిత్యం మొదట వైదిక సాహిత్యంతోనే ప్రారంభమయింది. కాని కన్నడ సాహిత్యం 10వ శతాబ్దానికి ముందే వున్న జైన సాహిత్యంతోనే ప్రారంభమయింది.

**1. బౌద్ధ, జైన సాహిత్యాల ప్రభావం**

రామాయణం శ్రీరామునికి సంబంధించిన ఒక గొప్ప వర్ణనాత్మక కథ. వాల్మీకి శ్రీరామునికి సమకాలీనుడు. కనుక, అతని రామాయణం సాహిత్య ప్రపంచంలో సర్వాలంకార గుణసౌందర్యమైన ఆదికావ్యం. వాల్మీకి రామాయణం భారత జాతీయ కావ్యం; విశ్వవిఖ్యాతమైన మహాకావ్యం. ఇలాంటి పవిత్ర వాల్మీకి రామాయణం ఈనాడు అన్ని దేశాల్లోనూ, అనేక భాషల్లోనూ వ్యాప్తి చెంది సాహిత్య సౌరభాలను వెదజల్లుతోంది. అయితే, బౌద్ధులు, జైనులు రామాయణ కథను వారి సిద్ధాంతాలకు అనుకూలంగా మార్పు చేసుకొన్నారు. కన్నడిగలు ఈ మార్పులను అంగీకరించి తమ భాషలోకి అనువదించుకొన్నారు. అలా కాకుండా తెలుగు ప్రజలు వాల్మీకి రామాయణ అడుగుజాడలనే అనుసరించారు. వీరు బౌద్ధ, జైన ప్రభావాలకు లోనవలేదు.

**2. తెలుగు, కన్నడ భాషలలో ప్రాచీన రామాయణాలు**

కన్నడంలో రామాయణాలను జైన, వైదిక, వీరశైవ రామాయణాలని మూడు వర్గాలుగా విభజించారు. అయితే తెలుగులో ఒకే ఒక రకమైన రామాయణం ఉంది. అది వైదిక రామాయణం. క్రీ.శ.1100లో కన్నడంలో మొదట సుప్రసిద్ధమైన రామాయణం నాగచంద్రుని 'రామచంద్ర చరిత పురాణం'. ఇది జైన సంప్రదాయానికి చెందినది. నాగచంద్రునికి అభినవ పంప అనే పేరు కూడా వచ్చింది. ఇతని రామాయణాన్ని 'పంప రామాయణం' అని కూడా పిలుస్తారు. కన్నడ భాషలోని తొరవె రామాయణ కర్త వైదిక కవి. ఇతని పేరు నరహరి. ఇతనినే కుమార వాల్మీకి అని కూడా పిలుస్తారు. ఇతని నిశ్చితమైన కాలం తెలియదు. అయినా ఎడ్వర్డ్ పి.రైస్ గారు రచించిన 'కన్నడ సాహిత్య చరిత్రె'లో నరహరి క్రీ.శ.1500 లో ఉన్నట్లు వెల్లడిరచారు. వీరశైవ రామాయణాలలో బత్తలేశ్వరుడు రాసిన 'బత్తలేశ్వర రామాయణ' పేర్కోదగ్గ రామాయణం. బత్తలేశ్వరుని కాలం క్రీ.శ.15వ శతాబ్దం. అయితే ఇతని రామాయణం అలభ్యం.

తెలుగులో క్రీ.శ.14వ శతాబ్దంలో గోనబుద్ధారెడ్డి 'రంగనాథ రామాయణం' రాయగా, హుళక్కి భాస్కరుడు 'భాస్కర రామాయణా'న్ని రచించారు. తర్వాత క్రీ.శ. 15వ శతాబ్దంలో ఆతుకూరి మొల్ల 'మొల్ల రామాయణం' రాసింది. ఇవి తెలుగులో ప్రసిద్ధి చెందిన ప్రాచీన సంప్రదాయ వైదిక రామాయణాలు.

**3. తెలుగు, కన్నడ భాషలలో ఆధునిక రామాయణాలు**

తెలుగు రామాయణాలలో తిక్కర రచించిన 'నిర్వచనోత్తర రామాయణం' మొట్టమొదటిది. నాటి నుంచీ నేటి వరకూ తెలుగులో మార్గ - దేశి కవిత్వాలలో రామాయణాలు చాలా వచ్చాయి. అందుకే ''ఆకాశంలోని నక్షత్రములను, ఆంధ్ర భాషలోని రామాయణ కవులను లెక్కపెట్టడం అసాధ్యము'' అని ఆరుద్రగారన్నారు. చాలా మంది కవులు 19-20 శతాబ్దాలలో కూడా రామాయణాలు రాశారు. వారిలో ఆధునిక కవి అయిన కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు (1895-1976) ''శ్రీమద్రామాయణ కల్పవృక్షం'' అనే లోకోత్తర గ్రంథాన్ని రచించారు. దీనికి 1971లో భారతీయ జ్ఞానపీఠ పురస్కారం కూడా లభించింది. ఈ గ్రంథం ఇంచుమించు కవిత్రయ భారతానికి సమానం.

అలాగే కువెంపు అనే సంగ్రహ నామం గల కుప్పళ్ళి వెంకట పుట్టప్పగారు (1904-1994) కన్నడంలో ''శ్రీరామాయణ దర్శనం'' అనే ఒక మహాకావ్యాన్ని రాశారు. ఇది 20వ శతాబ్దంలో జనప్రియమైన ఆధునిక రామాయణం. దీనికి 1955లో కేంద్ర సాహిత్య అకాడెమి ప్రశస్తి, 1967లో భారతీయ జ్ఞానపీఠ పురస్కారం లభించాయి. ఇదే కృతికి 1988లో కర్నాటక ప్రభుత్వం నుంచి పంపప్రశస్తి కూడా లభించింది.

విశ్వనాథ సత్యనారాయణగారూ, కువెంపుగారూ ఇంచుమించుగా ఒకే కాలం వారు కావటమూ, ఇద్దరికీ జ్ఞానపీఠ పురస్కారాలు తమదైన రామాయణాలకే లభించటమూ కాకతాళీయం. ఇద్దరూ బహువిధ గ్రంథ కర్తలు. వీరు కావ్యాలు, నాటకాలు, నవలలు, విమర్శన గ్రంథాలు, కవితలు, నాటికలు, వ్యాసాలు రాశారు. అనేక ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు ఇచ్చారు. వీరు ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసాలు సమగ్రంగా ఉన్నవారు.

విశ్వనాథ అద్వైతి, శివభక్తుడు. జగత్తును వైష్ణవీతేజమని దర్శించినవారు. ఇహపరసాధనా రూపమైన సంప్రదాయాభివ్యక్తికి సహస్రముఖముల దోహదం చేసిన మహాకవి విశ్వనాథగారు. విశ్వనాథగారికి రామాయణం రాయాలన్న తపన గాఢంగా ఉండేది. దీన్నే విశ్వనాథ జీవుని వేదనగా పేర్కొన్నారు –

> ''వ్రాసిన రామచంద్ర కథవ్రాసితినంచనిపించుకో వృథా
> యాసముగాక కట్టుకథ లైహికమా? పరమా? యటంచుదా
> జేసిన తండ్రి యాజ్ఞయును జీవుని వేదన రెండు నేకమై
> నాసకలోహవైభవ సనాథనాథ కథన్ రచించెదన్''
>
> (అవతారిక ప.7)

తండ్రి ప్రేరణ తన జీవుడి వేదనను తీవ్రతరం చేసింది. రామాయణం తమ సకలోహవైభవ సనాథంగా రూపుదిద్దుకోవటానికి ఆయన అనేక ప్రయాసలు పడ్డారు. అనేక శాస్త్రాల్ని, కావ్యాల్ని, పాశ్చాత్య సాహిత్య తత్త్వాన్ని, ఇదీ అదీ అనకుండా అన్ని రకాల పుస్తకాలనూ చదివారు. దారిద్ర్యాన్ని అనుభవించారు. ఆఖరికి దైవికంగా భార్యావియోగ దు:ఖాన్నీ అనుభవించారు. విశ్వనాథగారు రామాయణాన్ని రాయటానికి 28 సంవత్సరాలు పట్టింది.

కువెంపు రామాయణం రచనకై మొదట యే ప్రత్యేకమైన ప్రయత్నాన్ని గానీ, సాధనగానీ చేయలేదు. ఒక సామాన్య కావ్యంగానే ఆయన రామాయణ కావ్య రచన ప్రారంభించారు. రామాయణం ముక్కాలు భాగం ముగిసే వరకు దాని గొప్పతనం ఆయనే గుర్తించలేకపోయారు. కాని 'శ్రీరామాయణ దర్శనం' కృతిని రచించిన

కువెంపుగారిని వినోబా భావె 'ఆధునిక వాల్మీకి' అని పిలిచారు.

విశ్వనాథ కువెంపులిద్దరూ వాల్మీకి యెడల అమితమైన భక్తి కలవారు.

''ఒక్క వాల్మీకి కాక వేఱొక్కడెవడు
సుకవిశబ్ద వాచ్యుండు'' అనీ,

''ఈ సంసారమిదెన్ని జన్మలకు నేనీ మౌని వాల్మీకి భాషా సంక్రాంత ఋణంబు దీర్పగలదా!'' అనీ విశ్వనాథ వాల్మీకిని స్తుతించారు.

కువెంపు :

"వ్యోమ సాగర సమం నిన్న రామాయణం,
గురువె, రసఋషియె, ఓ వాల్మీకి.........
.......... తందె, కైహిడి నడెసు
నిన్నణుగ నీ కందనం.''

గురూ, రసఋషీ, ఓ వాల్మీకీ, నీ రామాయణం వ్యోమసాగర సమం. తండ్రీ, నీ శిష్యుడైన ఈ పసివాడిని చేయూతనిచ్చి నడిపించు అనీ వాల్మీకిని స్తుతించారు.

పాత కథయైనా కొత్త కావ్యంగా మలచగల సామర్థ్యం కవి ప్రతిభలో ఉంటుందన్నది విశ్వనాథవారి నమ్మకం –

''కవి ప్రతిభలోన నుండును కావ్యగత శ
తాంశములయందు తొంబదియైన పాళ్ళు
ప్రాగ్వి పశ్చిన్మతంబున రసము వేయి
రెట్లు గొప్పది నవ కథా ధృతిని మించి''

(అవతారిక. 5)

కువెంపు దృష్టిలో కూడా ఇది పాత కథా లేక కొత్త కథా అన్న ప్రశ్నలేదు.

''పింతె వాల్మీకియులిద కథెయాదొడం, కన్నడది
బేరె కథె యెంబంతె, బేరె మైయాతంతె,
మరువుట్టు పడెదంతె, మూడిదీ కావ్యమం
విశ్వవాణిగె ముడియ మణి మాడిహెన్''

పూర్వం వాల్మీకి చెప్పిన కథే ఐతే ఏమి? కన్నడంలో వేరు కథ అన్నట్లు, వేరు శరీరం ధరించినట్లు, మరు జన్మయెత్తినట్లు ఈ కావ్యం ఉదయించింది. దీన్ని విశ్వవాణికి శిరోమణి గావించాను అని అంటారు కువెంపు.

విశ్వనాథ సర్వధర్మ బీజంగా అవిచ్ఛిన్న సంప్రదాయాన్ని నిరూపించటమే తన ధ్యేయంగా చెప్పుకొన్నారు.

కువెంపు ప్రాచీన సంప్రదాయాన్ని ఆధునికాభిరుచులకు అనుగుణంగా పరివర్తించి ప్రదర్శిస్తారు. ఈ కావ్యాన్ని రెండు మూడు దృష్టులతో చూడవలసి ఉంటుంది. ''కావ్యం కావలసిన వారికి ఇందులో కావ్యం లభిస్తుంది. కథ కావలసిన వారికి కథ లభిస్తుంది. దర్శనం కావలసిన వారికి దర్శనం లభిస్తుంది'' అని చెప్పారు. ఇంకో చోట ఈ కావ్యాన్ని ''మనశ్శాస్త్ర దృష్టితో కూడా చూడాలి'' అని కువెంపు తెలియజేశారు.

సంస్కృత వాల్మీకి రామాయణంలో 24 వేలు శ్లోకాలున్నాయి. అయితే, విశ్వనాథ రామాయణం వాల్మీకానికి ఒకటిన్నర రెట్లు పెద్దది. కువెంపు రామాయణం వాల్మీకి రామాయణంతో పోల్చి చూస్తే పరిమాణంలో అర్థభాగం మాత్రమే. అంటే విశ్వనాథ రామాయణం కువెంపు రామాయణం కంటే మూడు రెట్లు పెద్దది.

విశ్వనాథ వాల్మీకాన్ననుసరించి ఆరు కాండాలుగా రామాయణాన్ని రచించారు. కాండకు ఐదేసి ఖండాలు, ఖండానికి 400 గద్యపద్యాలుగ అంటే కాండకు 2000 గద్యపద్యాలుగ, మొత్తం 12000 గద్య పద్యాల నిడివిగల బృహత్ కావ్యంగ విశ్వనాథ రచించారు. దీన్ని 1934లో

ప్రారంభించి 1962 నాటికి పూర్తి చేశారు. దాదాపు మొత్తం 28 సంవత్సరాలు పట్టింది.

కువెంపు రామాయణాన్ని నాలుగు సంపుటాలుగా విభజించారు. వాటికి క్రమంగా అయోధ్యా, కిష్కింధా, లంకా, శ్రీ సంపుటాలనే పేర్లు పెట్టారు. ఈ సంపుటాలను మొత్తం 50 సంచికలుగా విభజించుకొన్నారు. మొత్తం 'శ్రీరామాయణ దర్శనం' 22,227 పంక్తులు కలిగిన కావ్యం. దీన్ని రాయడానికి 1936లో ప్రారంభించి 1945 నాటికి ముగించారు. అంటే దాదాపు 10 సంవత్సరాల కాలం పట్టింది. విశ్వనాథ కువెంపులిద్దరూ ఉత్తర కాండను రచించలేదు. శ్రీరామ పట్టాభిషేకంతోనే గ్రంథ సమాప్తిగావించారు. కాని వారి పూర్వరామాయణాలలోనే అక్కడక్కడ భావ్యర్థ సూచనల ద్వారా ఉత్తర రామాయణ కథను సూచించారు.

విశ్వనాథవారి రామాయణంలోని ఛందస్సు చంపూశైలి. విశ్వనాథగారు ఉపయోగించినన్ని ఛందస్సులు బహుశః ఛందశ్శాస్త్ర కర్తలు తప్ప కావ్యకర్తలు ఎవరూ ఉపయోగించలేదు. ఈ విషయంలో తిక్కనను కూడా మించిపోయారు. కల్పవృక్షం పూచిన ఛందస్సుమాలు 176. విశ్వనాథవారు వివిధ ఛందస్సులను వాడటంలో పలువిధాలైన చిత్ర ప్రయోగాలు చేశారు. తిక్కన తర్వాత తెలుగు భాషా వ్యవహారంలో పెరుగుతూ వచ్చిన పలుగుబడిని, కాకువును, వాక్యనిర్మాణ వైవిధ్యాన్ని కావ్యభాషలో ప్రవేశపెట్టి తెలుగు పద్యానికి కొత్త విచ్ఛిత్తి విశేషాలను కూర్చి పెట్టినవారు విశ్వనాథగారు.

శ్రీరామాయణ దర్శన కావ్యమంతా 'సరళరగడ' అనే ఒకే ఛందస్సులో రచితమైంది. కువెంపు దీనికి మహాఛందస్సు అని పేరు పెట్టారు. 'సరళరగడ' పెరిగి పరిపక్వం చెందిన రూపమే 'మహా ఛందస్సు' అని కువెంపుగారే చెప్పారు. ఇది మాత్రా ఛందస్సు. తెలుగు కన్నడ దేశీ ఛందస్సులలో రగడ ఒకటి. నియత మాత్రా గణాలు నియత సంఖ్యలో ఉండటం రగడ లక్షణం. ఆంగ్లభాషలోని Blank Verse తో పరిచయం గల ఆధునికులు కొందరు - యతి ప్రాసలు కాని, అంత్యానుప్రాసలు కాని లేని సరళ రగడలో రాయటం మొదలు పెట్టారు. కేవలం పాదానికి పంచమాత్రా గణాలు నాలుగు (5+5+5+5=20) ఉండాలనే నియమం మాత్రం పెట్టుకున్నారు. ఈ నియమానుసారమే కువెంపుగారి రామాయణంలో కనిపిస్తుంది.

విశ్వనాథగారికి పాషాణ పాక ప్రభువని వెక్కిరింపు బిరుదు ఉంది. వీరు మారుమూల సంస్కృత పదాలనీ, సమాసాలనీ వాడుతారనీ, ఆయన పద్యాలలో అన్వయ క్లిష్టత ఎక్కువనీ కొందరు విమర్శిస్తుంటారు.

> ''నిష్ఠావర్షద మోఘు మేఘు పటలీ నిర్గచ్ఛదుత్యోతిత
> స్పృష్టే రమ్మద మాలికాయుగ పదుజ్జృంభన్మహా ఘోర
> బం
> హిష్ఠ స్ఫూర్జ ధుషండ మండిత రవాహీన క్రియా ప్రాడి
> డ్రా
> ఘిష్ఠంబై యొక రావమంతతట నెసంగెన్ ఛిన్న
> చాపంబునన్''

(ధనుస్సు-303)

ఈ శివధనుర్భంగం చేసే వర్ణనగల పద్యం నిజంగా పాషాణపాకంగానే ఉంది.

అలాగే –

> ''శాంత కొడుకు వాన సంబరమ్మున దూగి
> వానలోన దిరుగు వచ్చి పురుటి
> యింట శౌరి జూచు నింతలో వానలో
> దిరుగు మరల జొచ్చు బురుటియిల్లు''

(అవతార . 231)

ఇలాంటి సరళ లలితమైన రచన కూడా విశ్వనాథవారు చేయగలరు. ఏ పద్యం ఎలాంటి శైలిలో రాయాలి అనేది

సమయ సందర్భాలను బట్టి ఉంటుంది.

కువెంపు 'శ్రీరామాయణ దర్శనం' కావ్యంలో ప్రయోగించిన భాష సంస్కృత హళెగన్నడ (పాత కన్నడం) ప్రాచుర్యం గలది. పౌరాణికేతివృత్తంగల ఈ మహాకావ్యానికి భాష జిగినీ బిగినీ కూర్పగలిగింది.

> ''లక్ష నక్షత్రమయ వక్షాంతరిక్షదా
> క్షీరసాగరదిం కిశోరశశి బరువంతె,
> ప్రతిభా తటిల్లతెయ సుప్రభా స్ఫూర్తియిం
> కవియ మనదిం మహాకావ్యముద్భవిపంతె''
>
> (కవిక్రతు దర్శనం . 413)

ఒక్కొక్క చోట కువెంపు అచ్చ కన్నడ పదాలనే కుమ్మరిస్తారు. కొన్ని చిత్రమైన ప్రయోగాలు రామాయణ దర్శనంలో కనిపిస్తాయి. కువెంపు చేసిన నూతన పద సృష్టి ప్రశంసనీయం. శిలాతపస్విని, తర్కసింహిణి, రససమాధి రూపాగ్నిరాశి, కృపాశూలి, ముక్తిరాహు మొదలైనవి. రేచక, పూరక, కుంభకాలు, అన్నమయ, మనోమయాది కోశాలు మొదలైన యోగశాస్త్ర పారిభాషిక పదాలెక్కువ. విశ్వనాథ సంస్కృత భాషా సాహిత్య పాండిత్యం కూలంకషమైంది. శాస్త్ర పరిచయం గాఢమైంది.

విశ్వనాథ కువెంపులిద్దరూ తమ తమ సిద్ధాంతాలను ప్రతిపాదించటానికే రామాయణ ఇతివృత్తాన్ని ఎన్నుకున్నారు. విశ్వనాథ తాను అవిచ్ఛిన్న సంప్రదాయార్థినని నిర్ద్వందంగా చెప్పుకొన్నారు. వర్ణవ్యవస్థా పరిరక్షణను అభిలషించటం, స్త్రీలకు నూతన స్వాతంత్ర్యాన్ని విరోధించటం, ఆధునిక యంత్రోపకరణలను అసుర నాగరికతగా పరిగణించటం వల్ల ప్రగతి విరోధిగా కనిపిస్తారు. కువెంపు సంస్కరణ వాదిలా కనిపిస్తారు. విశ్వనాథ అద్వైతి. శంకరాచార్య శిష్యులైన విశ్వనాథ శ్రీవిద్యోపాసకులు కావటం సహజం. వాల్మీకి రామాయణానికి అద్వైత పరంగాను, శ్రీవిద్యాపరంగాను విశ్వనాథ కావ్యభాష్యం రచించారు. కావ్య ధర్మాన్నను సరించి ఈ భాష్యం ధ్వన్యాత్మకంగా ఉంది. అంటే కథాస్రోతస్సు ఉపరివాహిని కాగా, దర్శన స్రోతస్సు అంతర్వాహినియై ఉండేటట్లుగా కూర్చబడింది. కావ్యకళాధర్మం చెడకుండా ఇలా దర్శన ధ్వనిని కావ్యమాద్యంతం నిర్వహించటం విశ్వనాథవంటి సిద్ధహస్తుడికే సాధ్యం.

కువెంపు తన రామాయణానికి 'శ్రీ రామాయణ దర్శనం' అని నామకరణం గావించారు. అందులో దర్శనం ప్రాధాన్యం వహిస్తున్నదని ఆయన ఉద్దేశ్యం. అరవింద దర్శనం ప్రభావం సర్వోదయ దర్శనంలా కువెంపు రామాయణ దర్శనం పై వుంది.

విశ్వనాథ, కువెంపుల రామాయణాలు కథానువాదాలు. కథా నిరూపణ దృష్టిలో ముఖ్యంగా గమనించవలసినవి అమూలక కల్పనలు, మూల కథా విపర్యయాలు.

విశ్వనాథ చేసిన కల్పనలు కొన్ని వాల్మీకి తెలిపిన కథకో, కథాక్రమానికో విరుద్ధంగా కనిపించినా నిజానికి వాల్మీకి హృదయానికి సన్నిహితమైనవే. ఉదాహరణకు శ్రీరాముడి వనవాసాన్ని వరంగా కోరటంలో ఆయన అవతార ప్రయోజన సిద్ధిసే కైక లక్షించినట్లు విశ్వనాథ ధ్వనిస్తారు. వాల్మీకి హృదయానికి విరుద్ధమైన కల్పనలు విశ్వనాథలో లేవు.

కువెంపు రామాయణంలో కల్పనలు చాలానే కనిపిస్తాయి. వాల్మీకి విరుద్ధ కల్పనలు ఎక్కువగా జైన రామాయణానుసరణాలే. తన రామాయణం పరంగా వాల్మీకికి ఎంత ఋణియో అంతే జైన రామాయణాలకు ఋణి అని కువెంపు చెప్పుకున్నారు. అలాగే ఆధునిక పాశ్చాత్య విద్వాంసుల భావనల ప్రతిధ్వనులు కూడా చాలా ఉన్నాయి. కువెంపు వాల్మీకంలోని స్వరూపాన్నే మార్చివేసి ఒక గొప్ప కల్పనగావించారు.

కువెంపు వానరుల స్వరూపం వాల్మీకాని కంటె భిన్నంగా రూపొందించారు. రాక్షసులు రాక్షస జాతివారే గాని రాక్షస

స్వభావులు కారు. అంటే వారు వికృతాకారులు కారు, నరమాంస భక్షకులూ కారు, క్రూర స్వభావులైన రాక్షసులూ కారు, వారు కూడా సుందరాకారులు, నాగరకాచారులు, సౌమ్యస్వభావులు అయిన మానవులే. విశేషించి కామరూపధరులు. ఇది ఆ జాతికి గల ఒక అతి మానవశక్తి. రావణుడు దశశిరస్కుడుగాడు. దశాననుడన్నది అతని బిరుదం మాత్రమే.

అలాగే వానరులు కూడా వానర జాతివారేకాని వానరులు కారు. అంటే తోకలు గల కోతులు కారు. వారు వానర ధ్వజులైన ఒక మానవ జాతికి చెందినవారే. కామరూపధారణ శక్తి వీరికీ కలదు. వీరందరూ యోగ సిద్ధులు. ఈ కల్పన మాత్రం జైన రామాయణానికి సంబంధించినది.

కువెంపు ఉత్తర దక్షిణ ఆర్యద్రావిడ వైషమ్యాలను కూడా తన రామాయణంలో ప్రవేశపెట్టారు. ఆర్యులు ఔత్తరాహులు. ద్రావిడులు దాక్షిణాత్యులు. ద్రావిడులు ఆర్యులచేత రాక్షసులుగా చిత్రించబడ్డారు. మధ్యగల వానరులు ఆర్యులూ కారు, ద్రావిడులూ కారు. అగస్త్యుడు ఉత్తరం నుండి దక్షిణాపథానికి వచ్చిన తొలి ఆర్యుడు. రాముడు ఆర్య నాగరికతను ద్రావిడ దేశంలో వ్యాపింపజేసిన ఆర్యవీరుడు.

అలంకారాలు కావ్యశోభాతిశయ హేతువులు. సర్వాలంకార బీజభూతమైన ఉపమాలంకారాన్ని విశ్వనాథ కల్పవృక్షంలో ఆధ్యాత్మిక, పౌరాణిక, ధార్మిక కవికావ్యోపమలుగా ఉపయోగించారు. అర్థాలంకారాలలో ఎక్కువగా ఉత్ప్రేక్షాలంకారాన్ని ఉపయోగించారు. కాని మహోపమాలంకారాలు కనబడవు.

అయితే కన్నడానికి కువెంపు అందించిన కానుక మహోపమ. ఈ పదం తెలుగు వారికి అపరిచితం. దీనినే Homeric Simile అని కూడా పిలుస్తారు. పాశ్చాత్య మహాకవి హోమరు తన మహాకావ్యంలో మొదటగా ఈ మహోపమను వాడారు. మహోపమ అంటే మహా ఉపమ. మహా అనగా దీర్ఘం అని మాత్రమే అర్థం కాకపోయినా, దీర్ఘత కూడా దానికొక అనివార్యమైన ఆత్మ లక్షణం. ఉపమ చేసే పనినే మహోపమ కూడా చేస్తుంది. ఇంకా బృహత్తుగా, మహత్తుగా ప్రదర్శిస్తుంది. ఈ మహోపమాలంకారాన్ని చాలా సార్లు వాడారు కువెంపు. అలాగే అర్థాలంకారాలలోని రూపకాలంకారాన్ని ఎక్కువ ఉపయోగించారు. కువెంపుకి శబ్దాలంకారాలంటే చాలా ఇష్టం.

**ముగింపు**

విశ్వనాథ, కువెంపుల రామాయణాలు రెండూ తత్వజ్ఞాన ప్రాముఖ్యత కలిగినవే. వీరి మహాకావ్యాలలో ప్రధానంగా 'శాంతరసం' కనబడుతుంది. కన్నడిగులు కువెంపుని 'రసఋషి' అనే ప్రశంసిస్తారు. విశ్వనాథ వాల్మీకిని తెలుగు సంస్కృతిని సంప్రదాయాలలోకి పరివర్తింపజేశారు. తెలుగు తనాన్ని తన రామాయాణంలో కనపరచారు. తెలుగు జాతీయాలను, సామెతలను పట్టుకొన్నారు. కథలో కొన్ని మార్పులు చేశారు. అయితే విశ్వనాథ, కువెంపులు మూలంలోని వాల్మీకి ఆలోచనలకు, భావాలకు వ్యతిరేకమైనవారు కారు. విశ్వనాథపై అద్వైతం మరియు శ్రీవిద్యా ప్రభావం ఉంది. కువెంపు నూతన ప్రగతి భావాలతో వాల్మీకిని ఆధునిక కవిగా మార్చివేశారు. దీనికి హేతువాద దృక్పథం గల జైన రామాయణాలే కారణం. పైగా కువెంపుపై అరవింద మరియు రామకృష్ణ పరమహంసల ప్రభావముంది. ఒక మాటలో చెప్పాలంటే, ప్రాచీన తెలుగు కవులలో విశ్వనాథ ఆధునిక కవి. ఇంకోవైపు ఆధునిక కన్నడ కవులలో కువెంపు ప్రాచీన కవి. అంటే ఇక్కడ భాషాపరంగా కువెంపు ప్రాచీనకవి. ప్రగతి పరమైన నూతన భావాల పరంగా కువెంపు అచ్చ ఆధునిక కవి అని నిక్కచ్చిగా చెప్పవచ్చు.

**సంప్రదింపు గ్రంథాలు**

**తెలుగు**


1. జయలక్ష్మి, చన్నాప్రగడ. 1983. కన్నడంలో రామకథ.
2. జయలక్ష్మి, చన్నాప్రగడ. (సం). 1997. పరిశోధన సౌరభము. బెంగుళూరు : బెంగుళూరు విశ్వవిద్యాలయం.
3. పాపయ్యశాస్త్రి, కావూరి. 1996. శ్రీమద్రామాయణ కల్పవృక్షము శ్రీరాముని మనుజధర్మము. భద్రాచలం: శ్రీజానకీ ప్రియ ప్రచురణలు.
4. వేంకటరామకోటిశాస్త్రి, కేతవరపు. సుప్రసన్నాచార్యులు, కోవెల. (సం).1974. విశ్వనాథ వాఙ్మయ సూచిక. వరంగల్లు : తెలుగు విభాగం, స్నాతకోత్తర విద్యాకేంద్రము.
5. సత్యనారాయణ, విశ్వనాథ....... శ్రీమద్రామాయణ కల్పవృక్షము (ఆరు సంపుటాలు).


**కన్నడం**


1. కువెంపు. 1992. శ్రీరామాయణ దర్శనం. బెంగళూరు: కన్నడ మత్తు సంస్కృతి ఇలాఖె.
2. రమేశ్, బె.గో. 2003. కన్నడద జ్ఞానపీఠ ప్రశస్తి పురస్కృతరు. బెంగళూరు : వాసన్ పబ్లికేషన్స్.


**English**


1. Srinath. (Ed). 2016. Essays on contemporary Telugu Literary Scene. Mysore: Dhvanyaloka Publications.